# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వ్యవసాయం, దాని అనుబంధరంగాలపై సమీక్ష నిర్వహించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

2. **రాష్ట్రంలో గ్రామ పంచాయతీల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్**

3. **మహిళల రక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న హోం మంత్రి వంగలపూడి అనిత**

4. **రాహదారి ప్రమాద బాధితులకుపీఎం రాహత్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్న రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంకు వెళ్లి.. పార్టీ నాయకులకు నిర్వహించే శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. అలాగే ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం వ్యవసాయ, అనుబంధ రంగాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈరోజు స్పందిస్తూ... పంచాయతీరాజ్ వ్యవస్థలో క్షేత్రస్థాయి నుంచి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ, ప్రతి గ్రామ పంచాయతీకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తూ, గ్రామ సభలకు పూర్వ వైభవం తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్థానిక స్వపరిపాలన వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ సభలు, పల్లె పండుగ కార్యక్రమాలు, స్వచ్ఛ రథాలు, వ్యర్థాల నిర్వహణ, మ్యాజిక్ డ్రైన్స్ వంటి వినూత్న కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ స్వరాజ్య ప్రణాళికలో భాగస్వాములైన ప్రజలు, సర్పంచులు, వార్డ్ సభ్యులు, అధికారులకు ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

--------------------------

సింగపూర్‌లో రాష్ట్ర మంత్రుల బృందం శిక్షణ కార్యక్రమం నాలుగవ రోజు కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న మంత్రులు, సింగపూర్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆధునిక ప్రజాస్వామ్య విధానాలు, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, పర్యావరణ అనుకూల చర్యలు వంటి అంశాలను అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు సింగపూర్ ప్రధానమంత్రి కార్యాలయంలో మాజీ మంత్రిగా పనిచేసిన లిమ్ స్వీ సే, అక్కడి పరిపాలన విధానాలపై మంత్రులకు సమగ్రంగా వివరించారు. దేశ ప్రయోజనాలతో పాటు సమష్టి అభివృద్ధి, ప్రజలు, ప్రభుత్వ- ప్రైవేట్ రంగాల సమన్వయం, దీర్ఘకాలిక ప్రణాళికలు, పారదర్శకత వంటి అంశాలపై చర్చించారు. అలాగే, నియోజకవర్గ స్థాయిలో స్పందన వ్యవస్థలు, ఫిర్యాదుల త్వరిత పరిష్కారం, స్థానిక సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించే విధానాలపై కూడా మంత్రులు అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, బి.సి. జనార్ధన్ రెడ్డి, వంగలపూడి అనిత, వై.సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

---------------------------

మహిళల రక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర పోలీసులు అప్రమత్తంగా పనిచేస్తున్నారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె ఈరోజు స్పందించారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వచ్చిన ఒక బాలిక, చీరాల బస్టాండ్ వద్ద దిక్కుతోచని స్థితిలో కనిపించగా, ఈ విషయం గమనించిన చీరాల 'శక్తి' టీమ్ పోలీసు సభ్యులు వెంటనే స్పందించారని చెప్పారు. ఆ బాలికతో మాట్లాడి, ఆమె వివరాలను సేకరించి, అనంతరం సంబంధిత వ్యక్తులకు సురక్షితంగా అప్పగించారని తెలిపారు. సకాలంలో స్పందించి బాలికకు అండగా నిలిచిన శక్తి టీమ్ సభ్యుల సేవలు అభినందనీయమని మంత్రి అనిత పేర్కొన్నారు.

---------------------------

రాహదారి ప్రమాద బాధితులకు "ప్రధానమంత్రి రహదారి ప్రమాద బాధితులు ఆసుపత్రిలో చేరిక, భరోసా చికిత్స" – పీఎం రాహత్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఒంగోలులోని రవాణా శాఖ కార్యాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం రాహత్ పై రూపొందించిన అవగాహన గోడపత్రికలను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారి ప్రమాదాల నియంత్రణకు పలు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లక్ష 50 వేల రూపాయల విలువైన వైద్యాన్ని క్షతగాత్రులకు ఉచితంగా అందించటానికి ఉద్దేశించిన పథకమే పీఎం రాహత్ అని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ సెకన్లు

---------------------------

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ – పాలిసెట్ 2026 ను రేపు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి చైర్మన్ నారాయణ భారత్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 120 ప్రాంతాల్లో 579 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

---------------------------

విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా

ఆంధ్ర విశ్వవిద్యాలయం 100 సంవత్సరాల ప్రయాణాన్ని స్మరించుకుంటూ విశాఖపట్నంలో ఈరోజు ఉదయం ఆర్కే బీచ్ ప్రాంతంలోని కాళీమాత ఆలయ సమీపంలో “వనితా వేవ్ ఏ100” పేరుతో శతాబ్ది వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌లో విశాఖ నగర ప్రజలు, విద్యార్థినులు, మహిళా సంఘాల సభ్యులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత, విద్యా ప్రాధాన్యత మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఘనతను ప్రతిబింబించే సందేశాలను ప్రదర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో మహిళల భాగస్వామ్యాన్ని తెలియజేయడమే ఈ వాక్ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

---------------------------

స్వీయ గణన సౌకర్యాన్ని వినియోగించుకుని ప్రజలందరూ జనగణనలో తప్పనిసరిగా పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థుల నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వర రావు కోరారు. భారత జనగణన కార్యక్రమంలో భాగంగా కాకినాడలోని తమ స్వగృహంలో మొబైల్ ఫోన్ ద్వారా స్వీయ గణనను పూర్తి చేశారు. అనంతరం చాగంటి కోటేశ్వర రావు మాట్లాడుతూ, జనగణన దేశ, రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి పునాది వంటిదని, ఖచ్చితమైన జనగణన గణాంకాల ఆధారంగా ప్రభుత్వాలు భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తాయన్నారు.

వాయిస్ సెకన్లు

---------------------------

సముద్ర జీవులను రక్షించడం అందరి బాధ్యత అని బాపట్ల జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం సముద్ర తీరంలో, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి 353 ఆలివ్ రెడ్లీ సముద్ర తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలివ్ రెడ్లీ జాతి సంరక్షణ పర్యావరణ పరిరక్షణలో కీలకమని అన్నారు. కోస్తా తీర ప్రాంతాల్లో ఈ తాబేళ్ల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడం, ప్రజల్లో అవగాహన పెంచడం అత్యవసరమని తెలిపారు.

---------------------------

రాష్ట్రం లోని కాకినాడ నుంచి కర్ణాటకలో మైసూర్, రాజస్థాన్ లో హిసార్ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్ల స్థానంలో రెగ్యులర్ రైలు సర్వీసులు నడిపేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు టి. ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు.ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాలకు ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక రైళ్ళను రెగ్యులర్ చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరామని దీనికి అనుగుణంగా మే 1 నుండి ప్రతి సోమవారం, శుక్రవారం మైసూర్ కు, ప్రతి మంగళవారం హిసార్ కు రైళ్లు నడిపేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సర్వీసుల ద్వారా కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో స్థిరపడిన ఉత్తరాది రాష్ట్రాల ప్రజలతో పాటు స్థానికులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

=====================